క్లుప్తంగా

అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు

వీరవాసరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ ప్రాంగణాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సంవత్సర ప్రారంభంలోని మొట్టమొదటి గ్రామసభ ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. గ్రామ సభల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక స్మారక దినోత్సవం ప్రారంభం



అగ్నిమాపక స్మారక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు

భీమవరం: ముంబై ఓడరేవులోని మందుగుండు సామానుతో ఉన్న నౌకలో సంభవించిన అగ్ని ప్రమాదాన్ని నివారించే క్రమంలో అశువులు బాసిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకుంటూ ప్రతి ఏప్రిల్ 14వ తేదీన అగ్నిమాపక స్మారక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపకాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం భీమవరం అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక దినోత్సవ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ వరకు పట్టణంలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపకాధికారి సీహెచ్ సూర్య ప్రకాశరావు, చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో రామలింగేశ్వర సన్నిధి

కాళ్ల: ఓం నమః శివాయ, హర.. హర.. మహాదేవ అంటూ కోపల్లె గ్రామం సోమవారం శివ నామస్మరణతో మారుమోగింది. మండలంలోని కోపల్లె గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి దేవదాయ ధర్మదాయ శాఖ, గ్రామస్తులు పూనుకొని అత్యంత సుందరంగా దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ సందర్భంగా రెండు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు.

శేషవాహనంపై ఊరేగిన ఆదికేశవస్వామి

నరసాపురం: పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ ఆదికేశవ ఎంబేరుమానార్ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత ఆదికేశవస్వామి వారిని శేషవాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉదయం ఆలయ స్థానాచార్యులు కిడాంబి వెంకటాచార్యులు, ప్రధానార్చకులు పెద్దింటి మోహన రామాచార్యులు పర్యవేక్షణలో స్వామివార్ల అలంకరణ, తిరుమంజనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పుప్పాల వెంకటకృష్ణారావు, ఈఓ ఆర్‌వీవీఎస్ రామచంద్రరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశ్వాసమే సేవకునికి ఉత్తమ మార్గం

పెంటపాడు: యేసయ్యపై సంపూర్ణ విశ్వాసమే సేవకునికి నిజమైన ఉత్తమ మార్గమని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యుపీఎఫ్) అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. సోమవారం గూడెం ఎల్ఎల్ఎం విమోచన మందిరంలో పెంటపాడు, గూడెం, నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు పలు మండలాలకు చెందిన యుపీఎఫ్ సంఘ దైవసేవకులతో బల్లారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సేవకులు దేశ క్షేమం కోసం, సంఘ ఐక్యత కోసం, సేవకుల రక్షణ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జైబాబు సేవకులకు ప్రభు సంస్కారమైన బల్లారాధన అందజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న సేవకులనుద్దేశించి జైబాబు మాట్లాడుతూ దేవునిపై విశ్వాసం ఉంచే ప్రతీవారు ఆధ్యాత్మిక నిత్యం జీవం పొందుతారన్నారు. సిలువ ధ్యానాలు, బల్లారాధనలో సేవకుల విందు కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రారంభమైన ఉపాధి హామీ పనులు

భీమడోలు: భీమడోలు పంచాయతీ పరిధిలో సోమవారం జాతీయ ఉపాధి హామీ పథకపు పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పదవీ విరమణ కావడంతో ఉపాధి హామీ పనులు ముందుకు సాగక ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు పనులు కల్పించాలని మండల వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ పలు సార్లు అధికారులకు విన్నవించారు. అయితే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు ముందుగానే పూర్తి అయ్యాయని అధికారులు చెబుతున్నారు. అయితే అధికారులు స్పందించి ఉపాధి హామీ పనులు చేపట్టారు. దీంతో గ్రామంలోని 500 మంది పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- రాజ్యాంగ నిర్మాతకు నాయకుల నివాళి



భీమవరం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు



కాళ్ల: పెదఅమిరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



భీమవరం(ప్రకాశం చౌక్): అంబేడ్కర్ జయంతిని నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

భీమవరం: అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని పలు విద్యాసంస్థల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ అభిమానుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గునుపూడి, అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహాలకు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషనురాజుతో పూలమాలలు వేయించి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా రాజ్‌ట్రస్ట్ కార్యాలయంలోనూ, డీఎన్నార్ కళాశాలలోనూ, సీపీఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వి.రాజేష్‌కుమార్, సెక్రటరీ గౌతమ్‌కుమార్, జక్కరయ్య, కె.జోషఫ్, రాజ్‌కిషోర్, జె.ఏసుబాబు, గూడపాటి శాంతారావు, కేసీ రాజు, గాతల జేమ్స్, మంగం రమేష్, ఎస్.శ్రీకర్, డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్, ఏవో పి.రామకృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపల్ ఉషారాణి, మహ్మద్ జహీర్, సీపీఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారామ్‌ప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, తిరుమాని కామేశ్వరరావు, ఎం లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

కాళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, బీజేపీ నాయకులు కోరా రామమూర్తి కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు మండలంలో అన్ని గ్రామాల్లోనూ సోమవారం ఘనంగా నిర్వహించారు. బొండాడ, కాళ్ల, పెదఅమిరం, కోలనపల్లి ఏలూరుపాడు, కాళ్లకూరు, తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పెద అమిరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, జవ్వాది కిషోర్, బిరుదు గద్ద గంగాధర్, కోన జోసెఫ్, వేగేశ్న గోపాలకృష్ణంరాజు, గంటా ఆనందరావు, గంగయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఉండి: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా జైభీమ్ నినాదాలతో హోరెత్తిపోయాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యండగండి, చెరుకువాడ, ఉణుదుర్రు, మహదేవపట్నం, వెలివర్రు, పాములపర్రు, పాందువ్వ, కోలమూరు, ఆరేడు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్.జార్జ్‌ముల్లర్, వెలగపల్లి టోనీ, కిరణ్, నాగరాజు, బాలు, సురేష్, ప్రసంగిరాజు, చంటి, సందీప్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండలం వీరవల్లి పాలెం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని స్థానిక యువకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ సర్పంచి శీలబోయిన పద్మ కుమారి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కారిపల్లి నాగేంద్రబాబు, అశోక్, బొంతు అజయ్, చింతా బాలకృష్ణ,చిల్లా ప్రసాద్ బాబు, దుండి తాండవ కృష్ణ, లిఖితపూడి శ్రీను, వెంకట చందు, కారిపల్లి వెంకట్రావు, మేడపాటి సాగర్, కృష్ణమూర్తి, వేడంగి శ్రీను, వాసాల సాయి, చింతా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం అండలూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైల్వే రిటైర్డ్ జీఎం కాయల వెంకటరావు మాట్లాడుతూ అన్ని కులాల వారు తమ పిల్లలను బాగా చదించాలన్నారు.

అసమానతలపై అలుపెరుగని పోరాటం

భీమవరం (ప్రకాశంచౌక్): మానవ సమాన హక్కుల కోసం జీవితాంతం పోరాడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ అన్నారు. భీమవరం డిపోలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కేసీ రాజు, కోనా జోసెఫ్, గాతల జేమ్స్, రమేష్, జి.జాక్రయ్య, ఎస్.శ్రీకర్, కె.గౌతమ్ కుమార్, ఈది రవి, మహేష్, జి.గాంధీ, జాన్ కెనడి, విజయ కుమార్, బి.కమలాకర్ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తిదాయకం

భీమవరం అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ అన్ని వర్గాలకు అనుకూలంగా రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఎంపీడీవో మురళీగంగాధర్, కార్యదర్శులు, పాల్గొన్నారు.

యువత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ఆకివీడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని నేటి యువత కాపాడుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన జయంతి కార్యక్రమాన్ని పట్టణ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని మతాల ప్రజలు స్వేచ్ఛగా జీవించేందుకు రాజ్యాంగం దోహదపడుతుందన్నారు. పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్ మాట్లాడుతూ భారతీయులందరికీ పవిత్ర గ్రంథం రాజ్యాంగమన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి కౌన్సిలర్లు, బొండాడ వెంకటేశ్వరరావు, మండా ఏసేబు, కటికతల రాజారావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

సృష్టి ఉన్నంత వరకూ అంబేడ్కర్ సేవలు కొనసాగుతూనే ఉంటాయని ఎంపీపీ కఠారి జయలక్ష్మి అన్నారు. మండలంలోని అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కఠారి కేశవరావు, నక్కా రమేష్, రవి, మద్దా రవికుమార్, ఎనుకుల జార్జి, మరపట్ల నాని, రమేష్, కీరవాణి, రాజు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో అంబేడ్కర్ జయంతి

భీమవరం (ప్రకాశంచౌక్): యూనియన్ బ్యాంకు రీజినల్ ఆఫీస్‌లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ సత్యనారాయణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్, చీఫ్ మేనేజర్ రమణ, ఎస్సీ ఎస్టీ అసోషియేషన్ నేతలు నాగరాజు, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాడ వాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు

పాలకోడేరు: మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలకోడేరు, మోగల్లు, శృంగవృక్షం, గరగపర్రు, విస్సాకోడేరు, గరగపర్రు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు ఇంజేటి మరియమ్మ, జంగం సూరిబాబు, గొట్టుముక్కల శివాజీరాజు, నాయకులు కలిదిండి కృష్ణంరాజు, కొత్తపల్లి నాగరాజు, రామరాజు, పాలా రాధాకృష్ణ, గరగపర్రు అబ్బులు, గుంటపల్లి వెంకన్న, బలరామరాజు, తోకల సాల్మన్‌రాజు, నేతల శ్యామ్ కుమార్, దుండి సంజీవ్, చిగురుపాటి మాణిక్యాలరావు, ఎస్సై రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఉండి: అంబేడ్కర్ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ చినకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు సుందర్‌కుమార్



భీమవరం (ప్రకాశంచౌక్): అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వరప్రసాద్



ఆకివీడు: అంబేడ్కర్ జయంతి సందర్భంగా అన్నసమారాధన నిర్వహిస్తున్న నాయకులు



పాలకోడేరు: అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భీమవరం అర్బన్: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు



ఆకివీడు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, అంబటి రమేష్



ఉండి: చెరుకువాడలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా మాట్లాడుతున్న సర్పంచ్ సాంబశివరావు, పాస్టర్ జార్జిముల్లర్

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

భీమవరం: వాసవీ జాగృతి వీజేఎఫ్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జువ్వలపాలెం రోడ్‌లోని అష్టలక్ష్మి ఆలయం ఎదురుగా వాసవీ జాగృతి క్లబ్, ఆదిత్య డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన వేసవి మజ్జిగ చలివేంద్రాన్ని క్లబ్ జోన్ చైర్మన్ ఉప్పల నర్సింహమూర్తి, నాగలక్ష్మి దంపతులు ప్రారంభించారు. అనంతరం ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు బియ్యం, గోశాలలో గోవులకు దాణా పంపిణీ, గాలి రామయ్య మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులకు స్టీల్ కంచాలు, స్పోర్ట్స్ కిట్లు వంటివి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్రిపాటి శ్రీను, సబ్బిశెట్టి గణేష్, కోశాధికారి సంకగోపాలం, నాగ సూరీ మురళి, సమయమంతుల నాని, నూలి ప్రసాద్, మండ వెంకయ్య, వేముల శేఖర్, ఎ.కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ ప్రతినిధులు

రైల్వే స్టేషన్‌లో చలివేంద్రం ఏర్పాటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవిలో రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకులు సౌకర్యార్థం సోమవారం స్థానిక రైల్వే స్టేషన్లో రెండో నెంబర్ ప్లాట్ ఫారంపై తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు మదన్ మోహన్ అగర్వాల్ సహకారం అందజేశారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జెడ్ఆర్‌యూసీసీ సౌత్ సెంట్రల్ రైల్వే సభ్యులు రవి అగర్వాల్‌లు మాట్లాడుతూ వేసవిలో ప్రజలు, ప్రయాణీకులు తప్పక చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టేషన్ మాస్టార్ ఎస్.వెంకటరావు, గూడ్స్ చీఫ్ సూపరింటెండెంట్ దానయ్య, విశ్రాంత నాయకులు భాస్కరరావు, చైర్మన్ భూషణం, క్లబ్ సభ్యులు చిన్నం జగదీష్, భీమవరపు మహాలక్ష్మి, గరికపాటి బాపయ్యశర్మ, పేరూరి కాశియ్య, విశ్వేశ్వరరావు, పచ్చ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు ముందు.. సాగుకు వెనుక

- ఏటా మునిగిపోతున్న ఉండి పంట పొలాలు
- అభివృద్ధికి నోచుకోని పలు ప్రధాన మురుగు కాలువలు
- పనులకు కొద్దిపాటి నిధులు.. వందల కోట్లలో నష్టం

ఆకివీడు: ముంపునకు ముందు, సాగుకు వెనుక అన్న చందంగా ఉన్న ఉండి నియోజకవర్గంలోని పలు ప్రధాన మురుగు కాలువల ముంపుకు రైతులు భారీ పరిహారం చెల్లించక తప్పడం లేదు. గోటితో పోయేది గొడ్డలితో అన్నట్లుగా కొద్దిపాటి నిధులతో మురుగు కాలువల మరమ్మతులు చేపడితే వందల కోట్ల ఆదాయం పొందే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రధాన మురుగు కాలువలు చినకాపవరం డ్రెయిన్, రుద్రయ్యకోడు, పాతవయ్యేరు, ఉండి మండలంలోని బొండాడ డ్రెయిన్, పాలకోడేరు మండలంలోని గోస్తనీ డ్రెయిన్, పాలిమేరకోడు డ్రెయిన్, కాళ్ల మండలంలోని మొగదిండి డ్రెయిన్, అడ్డాల క్రీక్ డ్రెయిన్లు ఉన్నాయి. వీటితో పాటు పలు మీడియం, మైనర్ డ్రెయిన్లు, పూడికలు, తూడు, గుర్రపుడెక్కతో నిండి ఉన్నాయి. ఇటీవల కాలంలో అడ్డాల క్రీక్ డ్రెయిన్ అభివృద్ధి చేశారు. ప్రస్తుతం మొగదిండి డ్రెయిన్‌లో పూడిక తీత పనులు పంటిపై నిర్వహిస్తున్నారు.



గుర్రపుడెక్క(మేట), కిక్కిసలతో నిండి పోయిన స్థానిక చినకాపవరం డ్రెయిన్

వెలకట్టలేని నష్టం

నియోజకవర్గంలోని చినకాపవరం, బొండాడ, గోస్తనీ డ్రెయిన్ల ముంపు నష్టం వెలకట్టలేనిది. గత మూడు దశాబ్దాలుగా ఆయా మురుగు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టడం లేదు. దీంతో గుర్రపుడెక్క, తూడు, కిక్కిస డ్రెయిన్ల వెంబడి పేరుకుపోయి నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కల్గిస్తున్నాయి. దుక్కి వర్షానికే ఆయా ఆయకట్టు భూములు నీట మునుగుతున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో ఖరీఫ్ సాగు ఆరంభంలో భారీ వర్షాలకు ఆకుమడులు, నాట్లు మునిగిపోయి రైతులకు భారీ నష్టం కల్గిస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షాలకు మొత్తం పంట నీటి పాలవుతుంది. ఈ విధంగా వందల కోట్ల విలువైన పంట నీటి పాలవుతుంటే పాలకులు, అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారని రైతులు వాపోతున్నారు.

నిధులు మూరెడు.. పనులు బారెడు

ఆయా డ్రెయిన్ల అభివృద్ధికి ప్రతి ఏటా అరకొర నిధులు కేటాయిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఒక్కో ప్రధాన డ్రెయిన్‌అభివృద్ధికి రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వ్యయమవుతోంది. అయితే వందల కోట్ల రూపాయల విలువైన పంట నష్టపోయినా ప్రభుత్వాలు నిధుల కేటాయింపులో మీనమేషాలు లెక్కిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. బారెడు పనులు పెట్టుకుని, మూరెడు నిధులు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

వేసవిలోనైనా నిధులు మంజూరయ్యేనా?

ఈ వేసవిలోనైనా ఆయా ప్రధాన డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారో లేదో అన్న సందేహంలో రైతులు ఉన్నారు. డ్రెయిన్ల పటిష్టానికి ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి



వరి పొలాలు ఉన్న ప్రాంతాల్లో డ్రెయిన్లు, చెత్తా చెదారం గుర్రపు డెక్కన్ తో నిండిపోయి ఉంటున్నాయి. వర్షాలు వచ్చినప్పుడు మురుగునీరు లాగక పొలాలు ముంపు గురవు తున్నాయి. అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటే బయటపడొచ్చు.

కె.శ్యామ్, మోగల్లు

తుది దశకు ఆలయ పునర్నిర్మాణం

- రూ.3.40 కోట్లతో పనులు
- మే 1న రామేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ



వెలగలేరులో పునర్నిర్మిస్తున్న శ్రీరామేశ్వరస్వామి ఆలయం

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం వెలగలేరు గ్రామంలో స్టేట్‌హైవే పక్కన ఉన్న దేవదాయశాఖకు చెందిన పురాతన శ్రీపార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. లో లెవల్‌లో ఉండి, శిథిలావస్థకు చేరిన ఈ ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తుల కోరిక మేరకు 2023లో నాటి ఎమ్మెల్యే మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషి, నాటి సీఎం జగన్ ఆదేశాలతో నాటి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దేవదాయ శాఖ నుంచి రూ.కోటి మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేశారు. దీంతో 2023 డిసెంబర్ 6న అప్పటి ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు సమక్షంలో గ్రామానికి చెందిన తాడి ఫణికుమార్‌రెడ్డి, లక్ష్మి తులసీదేవి దంపతులు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామానికి చెందిన మరికొందరు దాతలు ముందుకురావడంతో అంచనా వ్యయాన్ని రూ.3.70 కోట్లకు పెంచి ప్రధాన ఆలయంతో పాటు సూర్య పంచాయతీన, సువర్చలా సహిత ఆంజనేయస్వామి, మేధా దక్షిణామూర్తి, ఉపాలయాలతో పాటు వ్యాఖ్యాన మండపంలో గణపతి మందిరం, రాజగోపురం, ధ్వజ స్తంభాల నిర్మాణం కూడా పూర్తిచేసి ఆలయం చుట్టు ప్రాకార నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆలయ పునఃప్రతిష్ఠకు సన్నద్ధమవుతున్నారు.

పునఃప్రతిష్ఠకు సన్నాహాలు

వెలగలేరు గ్రామంలో పునఃనిర్మించిన శ్రీపార్వతిసమేత రామేశ్వరస్వామి ఆలయంలో మే 1న విగ్రహాల పునః ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు శాంతి హోమ పూజలు నిర్వహిస్తామని, మే 1న ఉదయం 7.22 గంటలకు శైవాంగ విధానంగా పునః ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించి, ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు.

ఈనెల ఆఖరి వారంలో ప్రతిష్ఠ



ఈ నెల ఆఖరి వారంలో ఆలయ పునః ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా రాజకీయాలకు అతీతంగా గ్రామస్తుల సహకారంతో నిర్మాణ పనులు పూర్తిచేస్తున్నాం. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కొట్టు సత్యనారాయణలకు, దేవదాయశాఖ అధికారులకు గ్రామస్తుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

– కొవ్వూరి పుత్రారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు, వెలగలేరు.